# ది డిటెక్టివ్

● సి. రవీంద్రనాథ్ ●

హ్యూస్టన్ సిటీ టెలిఫోన్ డైరక్టరీలో థామస్ కీలింగ్ పేరు ఎంత వెతికినా దొరకదు.

ఆయన తన వృత్తిని మానేసి మరో వూరికి మారిపోకుండా వుంటే ఆయనపేరు టెలిఫోన్ డైరక్టరీలో వుండేదేమో. థామస్ కీలింగ్ డిటెక్టివ్ వృత్తిని స్వీకరించాడు.

ఒక యజమాని తమ దగ్గర పనిచేసే వ్యక్తిని గురించి తెలుసుకోవాలనుకొన్నప్పుడు, ఒక భార్య తమ భర్త మరే స్త్రీతోనైనా తిరుగుతున్నాడేమోనని తెలుసుకోవాలనుకొన్నప్పుడు థామస్ కీలింగ్ రంగంలోకి ప్రవేశిస్తూ వుంటాడు!

మిస్టర్ కీలింగ్ చాలా కాలం పొదుపు చేసి 900 డాలర్లు దాచుకున్నాడు. ఆ డబ్బులో కొంత ఖర్చుపెట్టి ఒక అపార్టుమెంటు అద్దెకు తీసుకొన్నాడు.

మూడు రోజుల పాటు ఎవరూ రాలేదు., మూడు రోజుల తరువాత ఒకమ్మాయి వచ్చింది. ఆమెకి ఇరవై ఆరుయేళ్ళు వుంటాయి. అందంగా పొడుగ్గా వుంది. చాలా నీటుగా దుస్తులు ధరించింది. మిస్టర్ కీలింగ్ ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంది. చాలా శ్రావ్యమైన కంఠంతో చాలా విచారకరంగా తానెందుకొచ్చింది చెప్పటం ప్రారంభించిందామె.

"నా కష్టాన్ని నా స్నేహితులెవరితోను చెప్పుకోలేను. అందువల్ల మీరు డిటెక్టివ్ కాబట్టి మీ దగ్గర కొచ్చాను. మీరు కొన్ని రోజుల పాటు నా భర్తని గమనించాలి. ఈమధ్య ఆయన నన్నంత ప్రేమగా చూడటం లేదు. మాకు పెళ్లయి ఐదు యేళ్ళు అవుతోంది. ఈ అయిదేళ్ళు మేమిద్దరం చాలా ఆనందంగా వున్నాము. ఈమధ్య ఆయన జీవితంలోకి మరో స్త్రీ ప్రవేశించిందన్న అనుమానం కలుగుతోంది నాకు. నా అనుమానానికి కొన్ని ఆధారాలు కూడా వున్నాయి. అందువల్ల కొద్ది రోజులపాటు మీరు ఆయన మూవ్‌మెంట్స్‌ని అబ్జర్వ్ చేయాలి. నేను రోజు సాయంత్రం వచ్చి మిమ్మల్ని కలుస్తాను. రోజు మీ పరిశోధనలో తేలిన విషయాలు నాకు చెప్పాలి. నా పూర్తి పేరు మీకు చెప్పను. మీరు నన్ను మిసెస్. ఆర్ అని పిలవొచ్చు. నా భర్త పేరు — ఆయనకి — వీధిలో నగలషాపు వుంది. ఈ కేసు పరిశోధించినందుకు మీకు నేను పెద్ద మొత్తంలో ఫీజు ఇస్తాను. ప్రస్తుతానికి ఈ 20 డాలర్లు వుంచండి అంటూ 20 డాలర్ల నోటు మిస్టర్ కీలింగ్‌కి అందించింది.

మిస్టర్ కీలింగ్ అలాంటి 20 డాలర్ల నోట్లను రోజుకి కొన్నివేలు అందుకున్నంత కేర్‌లెస్‌గా తీసుకొని జేబులో పెట్టుకున్నాడు. ఆమె చెప్పిన పని పూర్తి చేస్తానని మర్నాడు సాయంత్రం నాలుగు గంటలకు వస్తే తొలి రిపోర్టు సిద్ధం చేస్తానని హామీ ఇచ్చాడు!

మిస్టర్ .ఆర్ నగలషాపు యెక్కడ వుందో తెలుసుకున్నాడు. షాపులో కెళ్లాడు. ఓ చిన్న వస్తువు కొని, మిస్టర్ ఆర్‌ని దగ్గరగా చూసి మాట్లాడాడు. మిస్టర్ ఆర్‌ని గురించి చుట్టుప్రక్కల రహస్యంగా వాకబు చేశాడు మిస్టర్ కీలింగ్. మిస్టర్ ఆర్‌కి అన్నీ మంచి అలవాట్లే వున్నట్టుగా పరిశోధనలో తేలింది. మిస్టర్ ఆర్ తాగడు. సిగరెట్లు చుట్టలు కాల్చడు. జూదం ఆడడు. ఎప్పుడు షాపులోనే కూర్చుని దృష్టంతా వ్యాపారం మీదే కేంద్రీకరిస్తాడు.

మిస్టర్ ఆర్ నగలషాపు స్పష్టంగా కనిపించేంతగా కాస్త దూరంలో వున్న ఓ చిన్న హోటల్‌లో కూర్చుని వున్నాడు కీలింగ్. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఒక అందమైన అమ్మాయి నగలషాపుకి వచ్చింది. ఆమె మిస్టర్ ఆర్‌తో బాగా పరిచయమున్న వ్యక్తిలా చనువుగా మాట్లాడసాగింది. మిస్టర్ ఆర్‌కు కొంత డబ్బు యిచ్చాడు. పది నిమిషాలు తరువాత ఇద్దరు బయటకు వచ్చారు. మిస్టర్ ఆర్ షాపు తలుపులు మూసి తాళం వేశాడు. ఇద్దరూ కలసి ఎక్కడికో బయలుదేరారు. వాళ్ళిద్దర్ని రహస్యంగా ఫాలో అయిన డిటెక్టివ్ కీలింగ్ వాళ్ళిద్దరు హోటల్‌కెళ్ళి, భోజనం చేసి షాపుకి తిరిగి రావడం తరువాత ఆమె వెళ్ళిపోవడం గమనించాడు.

★★★★

మిస్టర్ కీలింగ్‌కి ఈ కేసు అప్పగించిన స్త్రీ మర్నాడు సాయంత్రం సరిగ్గా నాలుగు గంటలకి వచ్చింది. మిస్టర్ కీలింగ్ తన పరిశోధన సారాంశాన్ని ఆమెకి వివరంగా చెప్పాడు.

"నేనూహించింది నిజమేనన్నమాట. నా భర్త మరో స్త్రీతో తిరగడమే కాకుండా దానికి డబ్బులు కూడా ఇస్తున్నాడన్న మాట" అంటూ ఆమె కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"నిజానిజాలు నేను తెలుసుకోవాలి నా భర్త మరో స్త్రీతో తిరుగుతున్నాడన్న విషయాన్ని నా కళ్ళతో నేను చూడాలి. ఆ తరువాత నా భర్తనించి విడాకులు తీసుకుంటాను. ఇందుకు అవసరమైన సాక్ష్యాధారాలు మీరు సేకరించి పెట్టాలి. అందామె.

బ్యాగ్‌లోంచి పది డాలర్ల నోటు తీసి డిటెక్టివ్ కీలింగ్‌కి అందించింది. అలాంటి నోట్లు తీసుకోవడం రోజూ తనకి మామూలే అన్న ధోరణిలో, కీలింగ్ ఆ నోటుని అందుకుని చాలా కేర్‌లెస్‌గా జేబులో పెట్టుకున్నాడు.

'ఈ అమ్మాయి అదే మీ భర్తతో తిరుగుతున్న అమ్మాయి ఎక్కువ సేపు షాపులో లేదు. వాళ్ళిద్దరి వ్యవహారం చూస్తే చాలా సన్నిహితంగా వున్నట్టే అనిపించింది నాకు. మధ్యాహ్నం వెళిపోతూ వాళ్లీ రాత్రి ఏదైనా మంచి హోటల్‌కి వెళ్ళి భోంచేద్దాం.

మళ్ళీ తిరిగి నా షాపుకి వద్దాం. నేను కబుర్లు చెపుతూ వుంటాను. నువ్వు ఏదైనా పనిచేసుకోవమ్మ అంది. అందువల్ల వాళ్ళిద్దర్నీ రెడ్‌హాండెడ్‌గా పట్టుకోవడానికి అదే సరైన సమయం అన్నాడు మిస్టర్ కీలింగ్.

మిసెస్ ఆర్ మరోసారి కళ్ళు తుడుచుకుంది. చూశారా డిటెక్టివ్‌గారూ! నా భర్త నాతో ఏం చెప్పాడో తెలుసా? తనకి రాత్రి చాలా ముఖ్యమైన పని వుందనీ ఎవరో పెద్ద వజ్రాల వర్తకుడు వస్తున్నారనీ చెప్పాడు. మీరు చెప్పిన దాన్ని బట్టి వజ్రాల వర్తకులు లేరు. దాంతో కలుకుతున్నాడన్నమాట. అంటూ మళ్ళీ కళ్ళుతుడుచుకుంది.

'మీరు మీ భర్తని రెడ్‌హాండెడ్‌గా పట్టుకోవాలంటే ఒకటే మార్గం కుర్చీలో వెనక్కివాలి చెప్పాడు డిటెక్టివ్ కీలింగ్. 'వాళ్ళిద్దరు భోజనానికి వెళ్ళినప్పుడు మీరు రహస్యంగా షాపులోకి ప్రవేశించి దాక్కోవాలి. వాళ్ళిద్దరూ భోజనం చేసి తిరిగి రాగానే పట్టుకోవాలి వాళ్ళని. అన్నట్టు మీ ఇంటి దగ్గర షాపు తాళాలు డూప్లికేట్ వున్నాయా?–

'లేవు. తాళాలెప్పుడూ ఆయన దగ్గరే వుంటాయి చెప్పింది మిసెస్ ఆర్.

మీ వారి షాపంతా పరిశీలించాను. వెనక నుంచి ఒక ద్వారం వుంది. దానికో పెద్ద తాళం కప్ప వేసుంది ఇలాంటి సందర్భాలు కోసమే నేను కొన్ని వేల తాళం చెవుల్ని సేకరించి వుంచాను. రాత్రి వాళ్ళిద్దరూ డిన్నర్‌కి వెళ్ళగానే వెనుక తలుపు తాళం తీసి మిమ్మల్ని షాపులోకి పంపుతాను. షాపు వెనుక వున్న గదిలో మీరు దాక్కోండి...

మిస్టర్ కీలింగ్ మాటలకు అడ్డు వస్తూ అడిగింది మిసెస్ ఆర్. ''నేను చూడటం మీరు చూడడం కన్నా ఎవరైనా పోలీసు చూస్తే ఇంకా మంచిది కాదా! సాక్ష్యం బలంగా వుంటుంది.''

డిటెక్టివ్ కీలింగ్‌కి అది కూడా మంచి ఉపాయమే అనిపించింది.

ఈ రోజు రాత్రి ఆ వీధిలో బీట్ కానిస్టేబుల్ నాకు బాగా తెలుసు. ముందుగా అతనితో మాట్లాడి ఏర్పాటు చేస్తాను'' అన్నాడు.

రాత్రి సరిగ్గా ఏడుగంటలకు వాళ్ళిద్దరూ డిన్నర్‌కి వెళతారు. ఓ గంట సేపటికి గాని తిరిగి రారు. ఈ లోగా వెనుక తలుపు తాళం తీసి మిమ్మల్ని షాపులో ప్రవేశపెడతాను. వాళ్ళు తిరిగి రాగానే వెనుకనుంచి మీరు ముందు నుంచి మేము హఠాత్తుగా వచ్చేసి వాళ్ళిద్దర్నీ రెడ్‌హాండెడ్‌గా పట్టుకుందాం ఉత్సాహంగా చెప్పాడు మిస్టర్ కీలింగ్.

★★★★

మిస్టర్ ఆర్‌ని రెడ్‌హాండెడ్‌గా పట్టుకునేందుకు రంగం సిద్ధమయ్యింది.



ఏడుగంటలకు సరిగ్గా మిస్టర్ ఆర్ దగ్గరికొచ్చింది అతని ప్రియురాలు. ఇద్దరూ షాపు బయటికి వచ్చారు. మిస్టర్ ఆర్ షాపు తలుపులు మూసి తాళాలు వేశాడు.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నెమ్మదిగా బయలుదేరారు.

ఎదురుగా వున్న హోటల్లో ముందుగానే మిసెస్ ఆర్‌ని కూర్చోబెట్టిన మిస్టర్ కీలింగ్ వెంటనే ఆమెను వెంటబెట్టుకుని వచ్చాడు.

షాపు వెనుక తలుపుకి వున్న తాళాన్ని తన దగ్గర వున్న రకరకాల తాళం చెవులతో శతవిధాలుగా ప్రయత్నించి మొత్తం మీద తాళం తీసి మిసెస్ ఆర్‌ని షాపులోని స్టోర్ రూంలో దాచాడు.

కానిస్టేబుల్‌తో కలిసి ఎదురుగా వున్న హోటల్లో కాపలాకాశాడు.

గంటన్నర తరువాత మిస్టర్ ఆర్ తన ప్రియురాలితో తిరిగి వచ్చాడు.

తలుపు తాళాలు తీసి షాపులోకి ప్రవేశించాడో లేదో డిటెక్టివ్ కీలింగ్, కానిస్టేబుల్ ఇద్దరూ షాపులోకి లంఘించారు.

మిసెస్ ఆర్ రండి మీ భర్తని ఆయన ప్రియురాలినీ పట్టేసుకున్నాం అంటూ ఉత్సాహంగా అరిచాడు మిస్టర్ కీలింగ్.

లోపల నుంచి సమాధానం లేదు.

మిస్టర్ ఆర్ వాళ్ళిద్దర్నీ చూసి ఆశ్చర్యపడ్డాడు. ఆనక•షాపంతా చూసుకుని లబో దిబోమన్నాడు.

'నగలు నా నగలన్నీ పోయాయి పెద్దగా అరవసాగాడు మిస్టర్ ఆర్.

★★★★

ఇన్‌స్పెక్టర్ ఎడ్మండ్ ఎదురుగా డిటెక్టివ్ కీలింగ్, మిస్టర్ ఆర్ అతని ప్రియురాలు కానిస్టేబుల్ నిలబడి వున్నారు.

ఇన్‌స్పెక్టర్ ఎడ్మండ్ జరిగిన దంతా విన్నాడు.

ముందుగా పెద్దగా నవ్వాడు.

ఆనక మిస్టర్‌కీలింగ్ వైపు కోపంగా చూసి డ్రాయర్ తెరిచి ఓ పుస్తకం తీశాడు.

ఈ అమ్మాయేనా మీ దగ్గరికి వచ్చింది? అడిగాడు.

ఆశ్చర్యంగా అవునన్నాడు కీలింగ్స్.

అమ్మాయి కాదు. అబ్బాయి. పేరు హెన్రీపాల్. ఆడవేషాల్లో దొంగతనం చేస్తాడు. అతనే మిస్టర్ ఆర్ భార్యనని నమ్మించి మీతో షాపు వెనుక తాళం తెరిపించి షాపు దోచుకున్నాడు.

మీరు మిస్టర్ ఆర్ ప్రియురాలిగా భావించిన ఆమెని చూశారు. ఆయన భార్యే. హెన్రీ పాల్‌ని పట్టుకోవడం అతను కొట్టేసిన నగల్ని తిరిగి మిస్టర్ ఆర్‌కి ఇవ్వడం పెద్ద సమస్య కాదు. మీకు 24 గంటలు టైమిస్తున్నాను. మీ ఆఫీసు ముందున్న డిటెక్టివ్ ఏజెన్సీ బోర్డు తీసెయ్యడానికి తెలిసి సహకరించినా తెలియక సహకరించినా నేరం నేరమే. అయినా మొదటి తప్పుగా మిమ్మల్ని వదిలేస్తున్నాను అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఎడ్మండ్.

★★★★

ఆ తరువాత డిటెక్టివ్ కీలింగ్ మరే కేసూ పరిశోధించలేదు.

పరిశోధనలోకి దిగితే తన ప్రతిభ, మేధస్సు ప్రపంచానికి తప్పకుండా తెలిసి వుండేదని అభిప్రాయపడుతూనే వున్నాడు మిస్టర్ కీలింగ్ ఇంకా! ●